క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 29న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నక్కలగుట్ట మెయిన్‌రోడ్, ఎల్ఐసీ కార్యాలయం, ఏకశిల పార్కు, బాలసముద్రం ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు, కిషన్‌పుర ప్రాంతంలో ఉదయం 9గంటల నుంచి 10 గంటల వరకు, జులైవాడ, ప్రకాశ్‌రెడ్డి, ఎఫ్‌సీఐ కాలనీలో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మదన్‌కుమార్‌కు అబ్దుల్ కలాం ఎక్స్‌లెన్సీ అవార్డు



కాశిబుగ్గ: ఏపీజే అబ్దుల్ కలాం ఎక్స్‌లెన్సీ అవార్డును కాశిబుగ్గకు చెందిన ప్రైవేట్ వైద్యుడు గుండాల మదన్‌కుమార్ అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో టీఎస్ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, సరస్వతి ఉపాసకులు శర్మ నుంచి అవార్డును మదన్‌కుమార్ అందుకున్నారు.

వ్రింద్రాని అవార్డు అందుకున్న చందన



కాశిబుగ్గ: వరంగల్ అబ్బనికుంటకు చెందిన కూచిపూడి నృత్యకారిణి అప్పం చందన.. చెన్నైలో వ్రింద్రాని జాతీయ అవార్డును అందుకున్నారు. లాస్య డాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, 92.7 బిగ్ ఎఫ్ఎం, వీఆర్ చెన్నై సహకారంతో దేశంలో వివిద కళలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్న కళాకారులను గుర్తించి అవార్డులు అందజేశారు. ఈమేరకు శనివారం రాత్రి చెన్నైలో తమిళనాడు అటవీ శాఖ మంత్రి మతివెంతన్, నల్లి సిల్క్ శారీస్ చెన్నై అధినేత పద్మశ్రీ నల్లి కుప్పుస్వామి నుంచి అవార్డును చందన అందుకున్నట్లు ఆమె తల్లి రాధిక తెలిపారు.

డీఏపై కొరవడిన స్పష్టత

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఏపై స్పష్టత కొరవడిందని తెలంగాణ రెవెన్యూ నాన్ గెజిటెడ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్లి రవి తెలిపారు. ఎంత శాతం ఇస్తారు, ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టంగా చెప్పలేదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీఆర్సీ, 317 జీఓ ప్రస్తావన లేదని, సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. అయిదు డీఏలు పెండింగ్‌లో ఉంటే ఒక్క డీఏ ప్రకటించి ఎంత శాతం అనేది చెప్పకున్నా జేఏసీ నాయకులు మాత్రం గొప్పలు చెప్పుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి జిల్లా కన్వీనర్‌గా కడారి కుమార్




ఖిలా వరంగల్: ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి వరంగల్ జిల్లా కన్వీనర్‌గా ఉర్సు కరీమాబాద్‌కు చెందిన కడారి కుమార్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈమేరకు హనుమకొండలో సోమవారం జరిగిన సమావేశంలో ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి జిల్లా చైర్మన్ బండి అశోక్, ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు దండు మోహన్, కంకనాల సంతోష్, ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, రౌతు రమేష్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

టీడీపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా విద్యాసాగర్ రావు

వరంగల్ / హన్మకొండ: టీడీపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా అర్షనపల్లి విద్యాసాగర్ రావును నియమించినట్లు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు తెలిపారు.

ఒడిశాలో పత్తిసాగుపై వర్క్‌షాపు



వరంగల్ : ఒడిశాలోని కృషి భవన్ ఆడిటోరియంలో సోమవారం జరిగిన వర్క్‌షాపులో ఆ రాష్ట్ర ఆహ్వానం మేరకు తెలంగాణ నుంచి తెలంగాణ కాటన్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వ డైరెక్టరేట్ ఆఫ్ అగ్రికల్చర్ ఫార్మర్ ఎంపవర్మెంట్ డిపార్ట్‌మెంట్ ఒడిశాలో పత్తిపంట సాగు పెంపుదల, కొనుగోళ్ల క్రమబద్ధీకరణ, కాటన్ టెక్నాలజీ పరిశ్రమల అభివృద్ధిపై ఈ వర్క్‌షాపు నిర్వహించిందని ఆయన తెలిపారు. వర్క్‌షాపులో ఒడిశా ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్‌సింగ్ దేవ్, దేశంలోని ఐసీఏఆర్, సీఐసీఆర్ సంస్థల శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, సీసీఐ డైరెక్టర్లు, టెక్స్‌టైల్స్ ఇండస్ట్రీ ప్రతినిధులు పాల్గొని వారి సందేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

సంప్రదాయం ఉట్టిపడేలా..



కాజీపేటలో మహిళలు అమ్ముతున్న రకరకాల ప్రమిదలు

దీపావళి వేళ అమ్మకాల జోరు

- అందుబాటు ధరలో మట్టి ప్రమిదలు, పండుగ సామగ్రి, వస్తువులు

కాజీపేట: సంప్రదాయ పద్ధతిలో దీపావళి జరుపుకోవడానికి మట్టితో తయారైన వస్తువులు నగరంలోని అనేక ప్రాంతాల్లో ఆకర్షిస్తున్నాయి. అనాదిగా పట్టణంలో కుండలు తయారు చేసి విక్రయించే కుమ్మరులు తాజాగా వివిధ ఆకృతుల్లో సంప్రదాయ వస్తువులను తయారుచేసి విక్రయానికి పెట్టారు. దివాళి పర్వదినం వచ్చిందంటే వారి చేతిలో రూపుదిద్దుకున్న వస్తువులకు ఎక్కడాలేని డిమాండ్ ఉంటోంది. నగరంలోని పురవీధుల్లో వివిధ కళాకృతులతో మట్టి వస్తువులు పలు రంగుల్లో దర్శనమిస్తున్నాయి. మట్టితో తయారు చేసిన ప్రమిదలు, ఇతర కళాకృతులు సమీప పట్టణాలకు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. ట్రైసిటీలో ఇక్కడి ప్రమిదలకు చక్కటి ఆదరణ లభిస్తోంది. దీపావళికి రెండు నెలల ముందునుంచే కుండల తయారీని ఆపివేసి ఇక్కడ ప్రమిదల రూపకల్పన ప్రారంభిస్తారు. పండుగకు నాలుగైదు రోజులకు ముందే ప్రమిదలను మార్కెట్‌లో పెట్టి విరివిగా విక్రయిస్తారు.

ఆకట్టుకుంటున్న ఆకృతులు

దీపావళి పండుగకు వినియోగించే ప్రమిదలతో పాటు ముంగిట్లో వెలిగించే దీపాల కోసం వివిధ రకాల ఆకృతులు కొనుగోలుదారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పురాతన పద్ధతిలో మట్టి ప్రమిదలు అందరికి తెలిసినవే. మట్టితో ప్రమిదలకు రంగులు అద్ది ఆకర్షణీయంగా తయారు చేసి సామాన్యులకు అందుబాటు ధరల్లో విక్రయిస్తున్నారు. పల్లెం చుట్టూ ప్రమిదలు అమర్చిన ప్రత్యేకమైన హారతి పళ్లాలను విక్రయిస్తున్నారు. గుండ్రని వస్తువుగా ఉండి చిన్న ద్వారాలు ఏర్పాటు చేసి ఆకాశ దీపాలు, కలశం మాదిరిగా ఉండే దీపం కుందెలు ఇలా ఎన్నో రకాల వస్తువులు మార్కెట్‌లో లభిస్తున్నాయి. కుమ్మరి కార్మికుల కళాత్మకతకు ఈ వస్తువులు అద్దం పడుతున్నాయి.

అందుబాటు ధరలో..

పాతకాలం నాటి మట్టి పాత్రలు కనుమరుగు కావడంతో గతకొద్దికాలంగా మార్కెట్‌లో ప్లాస్టిక్ వస్తువులు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. ప్రమిదలు పోయి కొవ్వొత్తుల వెలుగులు వస్తున్న ఈ రోజుల్లోనూ మట్టితో తయారైన దీపావళి వస్తువులకు ఆదరణ ఏమాత్రం తగ్గకపోవడం గమనార్హం. పండుగ రోజున ఇళ్ల ముందు సాయంత్రం వేళల్లో దీపాలను వెలిగించినట్లయితే మహాలక్ష్మి నట్టింట్లోకి నడిచి వస్తుందనేది ప్రజల నమ్మకం. దీంతో బోగి పండుగకు ముందు రోజు నుంచే దీపాలు వెలిగించడం ఆనవాయితీగా వస్తోంది.

మట్టి వస్తువుల ధరలు(రూ.)	
ప్రమిదలు (డజను)	30
రంగులు అద్దిన ప్రమిదలు	40
ఆకాశ దీపాలు	100
పల్లెంతో ఉన్న దీపాలు	100
కలశ దీపాలు	125
రంగులు అద్దిన పళ్లెం దీపాలు	125

అమ్మకాలు పర్వాలేదు..



మట్టి ప్రమిదాల అమ్మకాలు గతంతో పోలిస్తే ఈ ఏడాది పర్వాలేదనిపిస్తోంది. దీపావళి పండుగ దగ్గర పడుతున్నకొద్దీ అమ్మకాలు పెరుగుతున్నాయి. అన్ని రకాలైన ప్రమీదలను సరసమైన ధరలకు విక్రయిస్తున్నాం.

– పెద్దపల్లి పద్మ, అమ్మకందారు

వృద్ధులు అమూల్యమైన సంపద



మాట్లాడుతున్న ఎమ్మెల్యే, చిత్రంలో కలెక్టర్

కాళోజీ సెంటర్: వయో వృద్ధులు సమాజానికి అమూల్యమైన సంపద అని వరంగల్ కలెక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వయో వృద్ధుల సంక్షేమ చట్టం 2007, నిబంధనలు 2011పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వయోవృద్ధుల అభ్యున్నతి, వారి సమస్యల సరిష్కారానికి పలు సూచనలిచ్చారు. వృద్ధులకు ఏ సమస్య ఎదురైనా టోల్ ఫ్రీ నంబర్ 14567ను సంప్రదించాలని సూచించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ కృష్ణవేణి, జెడ్పీ సీఈఓ రామిరెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజమణి, సీనియర్ అసిస్టెంట్ అరుణాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు మందుపై అవగాహన కల్పించాలి..

మత్తు మందుకు అలవాటు పడడం వల్ల జరిగే నష్టాల గురించి పీపీటీ ద్వారా డాక్యుమెంటరీ స్కూళ్లలో పిల్లలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆ శాఖ అధికారిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నార్కోటిక్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి నియంత్రణపై సమీక్ష నిర్వహించారు. నార్కోటిక్ పోలీస్ డీఎస్పీ సైదులు, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, వర్ధన్నపేట ఏసీపీ ఏ.నర్సయ్య, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, ఎక్సైజ్ శాఖ అధికారి మురళీధర్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంటకటరమణ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలో అక్రమ ఇసుక రవాణా అరికట్టి ప్రభుత్వ రెవెన్యూ పెంచేలా చర్యలు తీసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్య శారద అధ్యక్షతన ఇసుక సమస్యలపై తహసీల్దార్లు, మైనింగ్ అధికారి, ఇరిగేషన్ ఇంజనీర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

చెట్టు నరికిన వారిపై చర్య తీసుకోవాలి

హన్మకొండ అర్బన్: నగరంలోని ఫారెస్ట్ కార్యాలయానికి కూతవేటు దూరంలోని పిస్తా హౌజ్ పక్కన ఉన్న రిలయన్స్ ట్రెండ్స్ కాంప్లెక్స్ భవన యజమాని తన షాపు ముందున్న చెట్టును గత నెల 23వ తేదీన తొలగించాడు. ఈ విషయమై ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు సంబంధిత యజమానిపై అధికారులు చర్యలు తీసుకోలేదని పర్యావరణ పరిరక్షకుడు ప్రకాశ్ తెలిపారు. ఫిర్యాదు చేసి నెల రోజులు కావస్తున్నా అధికారుల నుంచి ఎలాంటి చర్యలు లేకపోవడంతో కాంప్లెక్స్ ఎదురుగా ప్రకాశ్ సోమవారం నిరసన తెలిపారు. ఆర్టికల్ 51 ఏజీ ప్రకారం పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతీ భారతీయ పౌరుడిపై ఉందని గుర్తుచేశారు.

విద్యార్థినులకు నాప్కిన్ల పంపిణీ



హసన్‌పర్తి: జిల్లా మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థినులకు నాప్కిన్లను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హసన్‌పర్తి మండల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరిశెట్టి బుచ్చన్న, సభ్యులు హేమచందర్, రంజిత్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతాంగానికి ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

హన్మకొండ అర్బన్: రాష్ట్ర రైతాంగానికి కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా ప్రతినిధి బృందంతో కలిసి హనుమకొండ డిప్యూటీ తహసీల్దార్ రంజిత్ కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం వరంగల్ డివిజన్ కార్యదర్శి అర్షం సుధాకర్, సహాయ కార్యదర్శి అంకుష్, మైదం పాణి, అర్షం అశోక్, రాజేంద్రప్రసాద్, బి.నరసింహారావు, వెంకన్న, సతీష్ పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) నాయకులు కోరారు. ఈమేరకు డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐపీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్ర సూరి, మైదం పాణి, రాజేంద్రప్రసాద్, నరసింహారావు, వెంకన్న, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ఏర్పాటు చేయాలి




సాయికుమార్‌ను సన్మానిస్తున్న బాధ్యులు

వరంగల్ లీగల్: గ్రామ, మండల స్థాయిలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ఉచిత న్యాయ సేవా తరగతులు నిర్వహించి సీనియర్ సిటిజన్స్, మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రతినిధులు కోరారు. ఈమేరకు ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీలు జస్టిస్ సాయికుమార్, జస్టిస్ క్షేమ దేశ్‌పాండేను జిల్లా కోర్టు ప్రాంగణంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు మాట్లాడుతూ తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ సంరక్షణ చట్టం -2007పై అవగాహన కలిగించాలని కోరారు. కార్యక్రమంలో సీనియస్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి తేరాల యుగంధర్, ఉపాధ్యక్షుడు నరసింహ, కోశాధికారి కె.రాజేందర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవం

రామన్నపేట: ఆర్యవైశ్య ఉన్నత పాఠశాలలో 1973 – 1974లో ఎస్సెస్సీ చదివిన పూర్వ విద్యార్థులు 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నగరంలోని కీస్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వర్ణోత్సవ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా అందరు ఒకచోట చేరుకుని నాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు. యోగక్షేమాలను పరస్పరం అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతిచెందిన గురువులు, మిత్రులకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో గురువులు నరసింహాచార్యులు, పూర్వ విద్యార్థులు యాదా విద్యాసాగర్, శివ వెంకటేశ్వరరావు, పీవీ నాగరాజు, శివకుమార్, మధుసూదన్, సురేష్, ఓంప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణోత్సవ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఐఆర్‌డీఏఐ విధానాలను నిరసిస్తూ ధర్నా



ధర్నా చేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు



నయీంనగర్: ధర్నా చేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

వరంగల్: ఇన్సూరెన్స్ నియంత్రణ సంస్థ (ఐఆర్‌డీఏఐ) విధానాలకు వ్యతిరేకంగా ఎల్ఐసీ ఏజెంట్లు భోజన విరామం సమయంలో సోమవారం గేట్ ధర్నా నిర్వహించారు. ములుగురోడ్డు సమీపంలోని కార్యాలయంలో జరిగిన ధర్నాకు డివిజన్ అధ్యక్షులు వైవి.కృష్ణారావు, పులి సుధాకర్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. పెంచిన ప్రీమియం రేట్లను తగ్గించాలని, కమీషన్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. బ్రాంచ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి అశోక్, శ్రీనివాస్, రాజిరెడ్డి, రవీంద్రరావు, సతీష్, శ్రీనివాసచారి, సత్యనారాయణ, తిరుపతి, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, భిక్షపతి, వీరస్వామి, తిరుపతిరెడ్డి, రవి బాబు, ప్రతిమ, సునీత, శ్రావణి, రజనీ, సరిత పాల్గొన్నారు.

హనుమకొండలో..

నయీంనగర్: తమ సమస్యలు పరిష్కరించాలని హనుమకొండ జీవిత బీమా సంస్థ ఏజెంట్లు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎల్ఐసీ బ్రాంచ్ ఎదుట భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య ఆధ్వర్యంలో ఏజెంట్లు సోమవారం మహాధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో లియాఫీ నాయకులు కుసుమ సత్యనారాయణ, వాసిరెడ్డి అప్పారావు, రాచకొండ వెంకటేశ్వర్లు, కాలే యాదగిరి, కేదారి, మొగిలి, ఉపేంద్రం, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జూడో దినోత్సవం



క్రీడాకారులతో జూడో సంఘం బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ పోచమ్మమైదాన్‌లోని కెమిస్ట్ భవన్‌లో ప్రపంచ జూడో దినోత్సవాన్ని సోమవారం జరుకున్నారు. వరంగల్ జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిథిగా ఒలింపిక్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బైరబోయిన కైలాస్‌యాదవ్ హాజరై మాట్లాడారు. పట్టుదల, క్రమశిక్షణ, నిత్య సాధనతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలని, అప్పుడే సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ వేడుకలకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 240 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను సన్మానించారు. కార్యక్రమంలో పీఈటీల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, జూడో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు దుపాకి సంతోష్, పొడాల రామయ్య, పీఈటీల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శీలం పార్థసారథి, కమలాకర్, జూడో కోచ్‌లు నాయకపు నాగరాజు, సీహెచ్ రాము, సాయిరాం, ఎస్.కుమార్, రాజు, లింగమూర్తి, భాస్కర్, శ్యామ్ పాల్గొన్నారు.

గురుకుల కళాశాల భవనాన్ని మార్చాలి

హన్మకొండ అర్బన్: శిథిలావస్థకు చేరిన హంటర్ రోడ్డులో గురుకుల డిగ్రీ కళాశాల అద్దె భవనంలో నుంచి ఇంకో భవనంలోకి కళాశాలను మార్చాలని, లేకుంటే సొంత భవనం నిర్మించాలని డీవైఎఫ్ఐ నాయకులు కోరారు. ఈమేరకు హనుమకొండ జాయింట్ కలెక్టర్ ఏ.వెంకట్ రెడ్డికి జిల్లా కార్యదర్శి డి.తిరుపతి సోమవారం వినతిపత్రం అందజేశారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

బాలసముద్రంలో సర్వే నంబర్ 1066లో 50 ఏళ్లుగా గుడిసెలు వేసుకొని నివాసముంటున్న తమకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని అంబేడ్కర్ నగర్ బస్తీ కమిటీ నాయకులు తెలిపారు. ఈమేరకు డీఆర్ఓ వైవీ.గణేష్‌కు వినతి పత్రం అందజేశారు. చంద్రమౌళి, స్వామి, రఘు, కృష్ణ, సంపత్, రమేష్, సుధాకర్, శ్రీను, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్య తీసుకోవాలి

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం అన్నాసాగరం ఫీల్డ్ అసిస్టెంట్ శ్యాంసుందర్‌పై చర్య తీసుకోవాలని స్థానికులు కోరారు. ఈమేరకు గ్రీవెన్స్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. అన్నాసాగరంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్యాంసుందర్ అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

కేపటీ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

హన్మకొండ: నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్‌లో హనుమకొండ నక్కలగుట్టలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ నళిని, ఇన్‌చార్జ్ నాగేశ్వర్ రావు సర్టిఫికెట్లు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానాన్ని సాధించారని తెలిపారు. 230 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 183 మంది ప్రథమ స్థాయిలో నిలిచారని వివరించారు.

వరంగల్: నాలెడ్జ్ అసెస్‌మెంట్ పరీక్ష (కేపటీ) ఫలితాల్లో కాశిబుగ్గ శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రిన్సిపాల్ బండారి కిరణ్ తెలిపారు. ఈమేరకు వారికి సోమవారం సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 113మంది విద్యార్థులు రెండవ స్థాయి పరీక్షలకు అర్హత సాధించారని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం రాజేశ్వర్ రెడ్డి, కోఆర్డినేటర్ తిరుమలరెడ్డి, డీన్ వెంకటేష్, సీ ఇన్‌చార్జ్ జనార్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామన్నపేట: ఇటీవల ప్రకటించిన నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్ (కేపటీ) ఫలితాల్లో హంటర్‌రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ తెలిపారు. ఈమేరకు వారికి పాఠశాల ఆవరణలో సోమవారం సర్టిఫికెట్లు ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సురేష్ మాట్లాడుతూ కేపటీ రెండవ స్థాయి పరీక్షలకు పాఠశాలకు చెందిన 125 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం రాజేశ్వర్‌రెడ్డి, కోఆర్డినేటర్ శివ కోటేశ్వర్, డీన్ రంజిత్, ఐపీఎల్ ఇన్‌చార్జ్ సన్నీ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నేడు అభ్యంతరాల స్వీకరణ

గీసుకొండ: వరంగల్ జిల్లాలో స్టాఫ్ నర్సు పోస్టుల కోసం సవరించిన మెరిట్ జాబితా తమ కార్యాలయం నోటీసు బోర్డుతో పాటు, కలెక్టర్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలుంటే అభ్యర్థులు మంగళవారం సాయంత్రం 5 గంటల్లోపు తమ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా అందించాలని కోరారు.

ఎన్‌సీసీ కేడెట్లకు అభినందన

కేయూ క్యాంపస్: సికింద్రాబాద్ మెహిదీపట్నం గారిసన్ మైదానంలో ఈనెల 16నుంచి 25వ తేదీ వరకు నిర్వహించిన ఐజీసీ ఆర్‌డీసీ క్యాంపునకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ కేడెట్లు వెంకటేశ్వర్లు, దినేష్, నవీన్ పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈమేరకు వారిని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, అధ్యాపకులు సోమవారం అభినందించారు.

నిరంతరం పెట్రోలింగ్ చేయాలి

హసన్‌పర్తి: శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి సూచించారు. కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌ను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట శ్వేతార్కుడికి నెయ్యితో అభిషేకం

కాజీపేట: స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో స్వామివారికి నెయ్యితో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు సాయికృష్ణ శర్మ సోమవారం అభిషేకం చేశారు.

ఉద్యోగ జీవితంలో సంతృప్తి

కేయూ క్యాంపస్: మూడు దశాబ్దాల ఉద్యోగ జీవితం సంతృప్తికరంగా ఉందని కాకతీయ యూనివర్సిటీలోని ఆడిట్ విభాగం సూపరింటెండెంట్ పురం రమేష్ అన్నారు. ఆయన ఈనెల 31న ఉద్యోగ విరమణ పొందబోతున్నారు. ఆయనతో పాటు 1992లో క్లర్క్ కమ్ టైపిస్టులుగా ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఇతర ఉద్యోగులను సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ నర్సింహారావు, డాక్టర్ కోల శంకర్, డాక్టర్ సుజాత, నిర్మల, హేమారాణి, సారయ్య, వెంకటేశ్వర్లు, భాస్కర్, శ్యాంకుమార్ పాల్గొన్నారు.

నరకాసుర వధను విజయవంతం చేయాలి

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు రంగలీల మైదానంలో ఈనెల 30న నిర్వహించనున్న నరకాసుర వధ కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. వరంగల్ కరీమాబాద్‌లోని బీరన్న గుడిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు శ్యామల రావు, ఆవునూరి రాంమూర్తి, రవి పాల్గొన్నారు.

డీఎండబ్ల్యూఓను కలిసిన టీజీఓ నాయకులు

హన్మకొండ అర్బన్: మైనార్టీ సంక్షేమ శాఖ హనుమకొండ జిల్లా అధికారి (డీఎండబ్ల్యూఓ)గా బాధ్యతలు స్వీకరించిన డి.మురళీధర్‌రెడ్డిని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో టీజీఓ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

శ్రీనివాసకాలనీ కమిటీ ఎన్నిక

వరంగల్: దేశాయిపేట రోడ్డు 13వ డివిజన్ శ్రీనివాసకాలనీ అభివృద్ధి కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వీరరౌతు విజయభాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఇట్టినేని సుధాకర్, కోశాధికారిగా పుల్లూరి అమరేందర్, కోశాధికారిగా నాగబోయిన వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడిగా ఎస్.ఉపేందర్, ఉపాధ్యక్షులుగా అశోక్‌రావు, ప్రకాశ్‌రావు, రాజిరెడ్డి, సంజీవ్, రఘురాంరెడి, సుభాష్‌గౌడ్, విజయ్, రామకృష్ణ, శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

రైలులో నుంచి జారిపడి యువకుడి దుర్మరణం

కాశిబుగ్గ: రైలులోనుంచి గుర్తు తెలియని యువకుడు జారిపడి దుర్మరణం చెందిన సంఘటన ఇంటికన్నె – నెక్కొండ రైల్వే స్టేషన్ల మధ్య సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వివరాలకు 97017 47014, 87126 58585 నంబర్లలో సంప్రదించాలని జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సురేందర్ కోరారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల హర్షం

కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థి సంఘం ఎన్నికల్లో వరుసగా ఐదోసారి ఎస్ఎఫ్ఐ కూటమి విజయం సాధించడంపై ఎస్ఎఫ్ఐ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు కేయూ వద్ద సంబరాలు జరుపుకున్నారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, జనరల్ సెక్రటరీ శ్రీకాంత్, కేయూ ఎస్ఎఫ్ఐ కమిటీ ఉపాధ్యక్షుడు జస్వంత్, అజయ్, అఖిల్, మంగీలాల్, రత్నం, భరత్, సందీప్, అభిషేక్ పాల్గొన్నారు.

వాగ్దేవిలో ఇంటర్న్‌షిప్ కమ్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

ఖిలా వరంగల్: వరంగల్ బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో బెంగళూరుకు చెందిన గ్లోబల్ క్వెస్ట్ టెక్నాలజీస్, ఇండస్ట్రీ ఇన్‌స్టిట్యూట్ ఇంటరాక్షన్ సెల్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటర్న్‌షిప్ కమ్ ప్లేస్‌మెంట్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పునీత్‌రాజ్‌కుమార్, జీఆర్ గ్లోబల్ క్వెస్ట్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్, వ్యవస్థాపకుడు నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

దసరా ఉత్సవ పేరును తొలగించడం సరికాదు

ఖిలా వరంగల్: వరంగల్ రంగలీల మైదానంలో దసరా ఉత్సవాల పేరుతో కూడిన రాతలను నరకాసుర ఉత్సవ కమిటీ తొలగించడం సరికాదని దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్ బాబు అన్నారు. రంగలీల మైదానంలో ఉత్సవ కమిటీ కార్యవర్గ ప్రతినిధులు నిరసన తెలిపారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా

కాళోజీ సెంటర్: రైతుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, జిల్లా కార్యదర్శి వీరగోని శంకరయ్య, వజ్రాల అరుణ, సాయిలు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

వరంగల్ క్రైం: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హోంగార్డ్ కుటుంబానికి రూ.30 లక్షల ప్రమాద బీమా చెక్కును వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా సోమవారం అందజేశారు.

తవ్వకాల్లో విగ్రహం లభ్యం

వరంగల్: వరంగల్ ములుగు రోడ్డు సమీపంలోని ఐటీఐ సమీపంలోని భవన నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టారు. ఈక్రమంలో విగ్రహం బయటపడగా భక్తులు పూజలు చేశారు.